భానుడి భగభగ.. హడలుతున్న జనం

నిర్మానుష్యమైన రహదారులు

విశాలాంధ్ర-యలమంచిలి: భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. గత వారం రోజుల నుంచి క్రమక్రమంగా భానుడి ప్రతాపం పెరుగుతుం డడంతో పగటి పూట ఇళ్ల నుంచి బయటకు రావాలంటే జనం భయపడుతున్నారు. యలమంచిలిలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వర ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఉక్కపోతతో జనం సతమతమవుతున్నారు. ప్రతిరోజూ 33 నుండి 34 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. భానుడు భగ్గుమంటుండడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండ వేడిమికి ప్రధాన జంక్షన్లు, వ్యాపార సముదాయాలు జనం లేక నిర్మాను ష్యంగా మారాయి. మరింత ఎండ వేడిమి ఉండడంతో చిన్నారులు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాదాచారులు ఎండ వేడిమికి గొడుగులు, తలపై టోపీలు, తువ్వాలు వంటివి కప్పుకుని రాకపోకలు సాగిస్తున్నారు. కాగా, రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. బయటకు వెళ్లేటప్పుడు ఎండ నుంచి రక్షణ చర్యలు తీసుకోవాలని తాగునీటితో పాటు మజ్జిగ, నిమ్మరసం వంటి ద్రావణాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచిస్తున్నారు.

వేసవి లో నీటి ఎద్దడి రాకుండా చర్యలు

తాగునీటి బోర్లు ప్రారంభించిన ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు

విశాలాంధ్ర-చోడవరం: చోడవరం పట్టణం లో ప్రజలు దాహార్తి ని తీర్చేందుకు నాలుగు చేతి బోర్లను స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు సోమవారం ప్రారంభించారు. పట్టణంలోని కోటవీధి, గండి కాలనీ, శివాలయం వీధిలలో మంజూరైన 4 చేతి బోర్లను, ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ బోర్లు త్వరగా పూర్తిచేసి, ప్రజలకు త్రాగునీటి సమస్య ను పరిష్కారించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి ఆంజనేయులు, ఈవో నారాయణరావు, సర్పంచ్ బండి నూకాలమ్మ, ఎంపీపీ గాడి కాసమ్మ, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోవాడ సుగర్స్ మాజీ చైర్మన్ గూనూరు మల్లునాయుడు, మాజీ ఎంపీపీ పెదబాబు, సకురు కోటేశ్వరరావు, దేవరపల్లి వెంకట అప్పారావు, మాజీ జెడ్పిటిసి కనిశెట్టి మత్సరాజు, గండి మూర్తి, ఎంపీటీసీ చిన్న, , పప్పు శ్రీను, వార్డు మెంబర్ సంతోష్, వార్డు మెంబర్ శేషు & దివ్య, శివాలయం చైర్మన్ గూనూరు సురేష్, గర్ల్స్ హై స్కూల్ చైర్మన్ గుమ్మల సత్తిబాబు, ఎస్సీ సెల్ అధ్యక్షులు మల్లిబాబు,పార్థు రాజు, బొబ్బిలి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో ఏడాదిలో రూ. 97 కోట్లతో అభివృద్ధి పనులు

కేజీబీవీ జూనియర్ కళాశాల అదనపు గదులు నూతన భవనాలకై శంఖుస్థాపన చేసిన సభాపతి అయ్యన్నపాత్రుడు

విశాలాంధ్ర-నర్సీపట్నం(మాకవరపాలెం): మాకవరపాలెం మండలం భీమ బోయిన పాలెం రూ.168.02 లక్షలతో నిర్మించనున్న అదనపు తరగతుల భవనాల కోసం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు భీమబోయిన పాలెం కేజీబీవీ కళాశాలలో సోమవారం శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, ఏడాది కాలంలో నియోజకవర్గంలో రూ. 97 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఏడాదికి రూ.100 కోట్ల చొప్పున నిధులు లభిస్తే, నాలుగేళ్లలో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి దిశగా నడిపించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అనుమతులు లేకుండానే మెడికల్ కాలేజీ నిర్మాణం చేపట్టారని, అయితే ఆ కాలేజీని అలా వదిలిపెట్టకుండా కార్పొరేట్ సంస్థలతో చర్చించి పూర్తి చేసే బాధ్యతను తీసుకుంటానని అన్నారు.

నర్సీపట్నంలో డిగ్రీ కాలేజ్ మొదలుకొని ఇంజనీరింగ్ కాలేజ్ వరకు అన్ని తెలుగుదేశం పార్టీ హయాంలోనే వచ్చాయన్నారు. విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తానని స్పీకర్ అయ్యన్న అన్నారు. ఇదే కళాశాలలో చదువు కున్న ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరంలో మంచి మార్కులతో ఉత్తీర్ణత అయిన విద్యార్థినిలను అభినందించారు. 10 నెలల కాలంలో మాకవరపాలెం మండ లానికి రూ.10 కోట్ల 70లక్షలతో సిసి రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులు 30పంచాయతీ లో చేపట్టినట్లు తెలిపారు. ప్రతి గ్రామానికి ఒక స్మశాన వాటిక నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. భీమ బోయినపాలెం పంచాయతీలో సీసీ రోడ్లు, అభివృద్ధి పనులకు కోటి 5 లక్షల రూపాయలతో పూర్తి చేసినట్లు తెలిపారు. మాకవరపాలెం మండలంలో ఎన్ఆర్ఈజీఎస్ గ్రాంట్ ద్వారా 113 వర్కులకు గాను సుమారు 10 కోట్ల 70లక్షలతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కస్తూరిబా పాఠశాల వద్ద నుండి విశాఖ ప్రధాన రహదారి వరకు వీధిలైట్లు ఏర్పాటుకు తోడ్పడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఆర్టీసీ బస్ స్టాప్, సోలార్ సిస్టం ఏర్పాటు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఆర్ వై పాత్రుడు, జనసేన కన్వీనర్, వెలమ కోఆపరేటివ్ డైరెక్టర్ సూర్యచంద్ర, గ్రామ సర్పంచ్ రుత్తల నందకిషోర్, శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామనాయుడు, అధికారులు, కేజీబీవీ ఉపాధ్యాయులు, మండల నాయకులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఎంఈఓ-2 రవీంద్రబాబు

విశాలాంధ్ర-సబ్బవరం: వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ- 2 ఎం.జె.రవీంద్రబాబు, స్థానిక సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక సబ్బవరం శాఖా గ్రంధా లయంలో సోమవారం గ్రంథాలయం అధికారి వి శిరీష ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాన్ని ఎంఈఓ-2 రవీంద్రబాబు, మేజర్ పంచాయతీ సర్పంచ్ దెడ్డం ప్రసాద్ రావు ముఖ్య అతిథులుగా పాల్గొని ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతి క్షణం చాలా విలువైనదన్నారు. వేసవి సెలవులలో విద్యార్థులు సమయాన్ని వధా చేసుకోవద్దని పాఠశాలలో కేవలం పాఠ్యాంశాలు మాత్రమే బోధిస్తారని, కానీ ఈ శిక్షణ తరగతుల్లో పాఠ్యాంశాలతో పాటు ప్రతి విద్యార్థినీ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు అవసరమయ్యే వ్యక్తిత్వ వికాసం, జీవన నైపుణ్యాలు, ఏకాగ్రత, సృజనాత్మక కళలు, దేశభక్తిని పెంపొందించుకోవడం మొదలగు అంశాల్లో శిక్షణ ఇస్తారని అన్నారు .గ్రంథాలయం అధికారి వి శిరీష మాట్లాడుతూ వేసవి శిక్షణా తరగతులు ఏప్రిల్ 28 నుండి జూన్ 6 వరకు ప్రారంభం కానున్నాయని, ఈ విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు ఉదయం 8గంటల నుండి 11 గంటలవరకు తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ రిటైర్ అధికారి రత్నకుమారి ,వార్డ్ మెంబర్ కొల్లి కృష్ణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయాల్లో ప్రారంభమైన వేసవి శిక్షణ శిబిరాలు

విశాలాంధ్ర-కె.కోటపాడు: మండలంలోని చౌడువాడ, కె. కోటపాడు శాఖా గ్రంధాలయాల నందు వేసవి శిక్షణ శిబిరాలు సోమవారము నుండి ప్రారంభమైయ్యాయి. విద్యార్థులు ముందు గా సరస్వతి దేవి నీ పూజించి పుస్తక పఠనం ప్రారంభించారు. ఈ కార్యక్రమాలు జూన్ నెల6 వ తేదీ వరకు నిర్వహించబడునని శాఖ గ్రంథాలయ అధికారిని ఎం పద్మావతి తెలిపారు. ప్రతిరోజు విద్యార్థులకు నీతి కథలు. దేశ నాయకుల గురించి తెలియజేస్తారన్నారు. అనంతరం విద్యార్థుల చే నీతి కథలు చదివించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠకులతోపాటు 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

తాళ్ళపాలెం శాఖా గ్రంధాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ

విశాలాంధ్ర-కశింకోట: తాళ్ళపాలెం శాఖా గ్రంధాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగ తులు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమ వారం నుండి జూన్ 6 వరకు పాఠశాల విద్యార్థులకు నిర్వహించబడుచున్న శిక్షణా తరగతులు స్థానిక వెటర్నరీ హాస్పిటల్ జూనియర్ వెటర్నరీ అధికారిణి సిహెచ్. కరుణశ్రీ ప్రారంభించారు. కరుణశ్రీ మాట్లాడుతూ ప్రతిరోజు విద్యార్థినీ విద్యార్థులు శిక్షణా తరగతులకు హాజరై గ్రంధాలయాన్ని ఉపయోగించు కుంటే విజ్ఞానాన్ని పెంచుకోవచ్చన్నారు. ప్రతిరోజు ఉదయం 8.00 లకు ప్రారంభమయి 11.00 గంటల వరకు జరుగు శిక్షణా తరగతులలో నీతి కథలు చెప్పడం, విద్యార్థులచే పుస్తకాలు చదివించడం, సంగీతం, చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్, క్విజ్, జి.కె., స్పోకెన్ ఇంగ్లీష్, పుస్తక సమీక్ష, డ్యాన్స్, ఆటలు కార్యక్రమాలు జరుగుతాయని, పిల్లలను తల్లి దండ్రులు ప్రతిరోజు పంపాలని గ్రంధాలయాధికారి కె.జగన్నాథం తెలిపారు. కార్యక్రమంలో గాయత్రి పాఠశాల ఉపాధ్యాయులు సిహెచ్. శాంతి, జె. అశ్విని, పాఠకులు, విద్యార్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

బాంబు బ్లాస్టింగ్ సామర్థ్యంపై విచారణ

విశాలాంధ్ర-పాయకరావుపేట : పోలవరం ఎడమ కాలువ తవ్వకాల్లో భాగంగా చేస్తున్న బాంబ్ బ్లాస్టింగ్ సామర్థ్యం వల్ల ప్రజలకు ఏమైనా నష్టం జరుగుతుందా అనే విషయమే నర్సీపట్నం డిఎస్పి పి. శ్రీనివాసరావు, సీఐ అప్పలరాజు, తహసిల్దార్ సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది విచారణ చేపట్టారు. బాంబ్ బ్లాస్టింగ్ వల్ల భయభ్రాంతులకు గురుగుతున్నామని, ఇళ్లు మరమ్మత్తులు గురవుతున్నాయని సమీప ప్రాంత వాసులు ఫిర్యాదులు చేస్తూ వచ్చారు. ఈ విషయమై బాంబు బ్లాస్టింగ్ సామర్థ్యం పై విచారణ నిర్వహించిన అధికారులు, బ్లాస్టింగ్ వల్ల వైబ్రేషన్ వస్తుందని గుర్తించి, బ్లాస్టింగ్ సామర్థ్యాన్ని తగ్గించాలని పోలవరం ఎడమ కాలువ అధికారులకు సూచించారు.

బైకు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి



విశాలాంధ్ర-కోటవురట్ల: బైక్ పై వేగంగా వస్తూ కరెంటు స్తంభాన్ని ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. స్థానిక ఎస్సై అందించిన వివరాల ప్రకారం ఎస్.రాయవరం మండలం వమ్మవరం గ్రామానికి చెందిన కొరిప్రోలు సర్వేరావు (45) తన స్వ గ్రామం నుండి బైక్ పై నర్సీపట్నం బయలుదేరి వెళుతుండగా రామచంద్రపురం వద్ద బైకు అదుపుతప్పి కరెంటు స్తంభాన్ని ఢీ కొన్నాడు. ఈ సంఘటనలో సర్వే రావు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై రమేష్ సంఘటనా స్థలానికి చేరుకొని జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఆయన తెలిపారు.

సూర్య నమస్కారాలలో ప్రపంచ రికార్డు నెలకొల్పిన చోడవరం యోగా గురువులు

విశాలాంధ్ర-చోడవరం : యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 7న అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో పతంజలి - ప్రణవ సంకల్ప యోగ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన 108 సూర్య నమస్కారాలను 108 నిమిషాల్లో పూర్తి చేసిన చోడవరం పతంజలి యోగ గురువు పుల్లేటి సతీష్ ను అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అభినందించారు. అల్లూరి జిల్లా కలెక్టర్ సమక్షంలో 21850 మంది విద్యార్థులతో 108 సూర్య నమస్కారాల ను 108 నిమిషాల్లో పూర్తి చేయించిన చోడవరం పతంజలి యోగా గురువులు పప్పల వెంకట రమణ మూర్తి, ఏ. శ్రీనివాస రావు, పుల్లేటి సతీష్ ల ను ఘనంగా సత్కరించారు.

రెల్లలపాలెం గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలి

వినూత్న రీతిలో గిరిజన చిన్నారుల వినూత్న ప్రదర్శన

విశాలాంధ్ర-చీడికాడ : మండలంలో కోనాం పంచాయితీ లోగల రెల్లలపాలెం గిరిజన గ్రామానికి రోడ్డు సదుపాయం కల్పించాలని పవన్ కళ్యాణ్ మామయ్య చంద్రబాబు తాతయ్య మా గ్రామానికి రోడ్డు వేయాలని అంటూ ఇద్దరు ఫోటోలతో చిన్నారులు గిరిజనులు సోమవారం రెల్లలపాలెం గ్రామంలొ వినూత్న రీతిలో నిరసన తెలి పారు గిరిజన చిన్నారులు గ్రామ ప్రజలకు ఆదివాసి గిరిజన సంఘం ఐదోవ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరట నరసింహమూర్తి మద్దత్తు తెలిపారు ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రెల్లలపాలెం గిరిజన గ్రామానికి రోడ్డు మౌలిక సదుపాయాలు అందు బాటులో లేక పోవడంతో ప్రజలు బిక్కు బిక్కుమంటూ గడుపుతున్నారుని అన్నారు ఈ విషయమై గత జనవరి 20న అనకాపల్లి జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేసామని తెలిపారు సర్వే కోసం అధికారులు వచ్చి రోడ్డు సెంక్షన్ కోసం ప్రతిపాదనలు పంపిస్తున్నామని అధికారులు తెలియజేశారని అన్నారు గ్రామానికి రోడ్డు సదుపాయం లేక పోవడంతో చిన్న పిల్లలు అంగన్వాడి సెంటర్ కు దూరం అయ్యారని అన్నారు విద్యార్థులు స్కూలుకి వెళ్లడానికి విద్యకు దూరం అయ్యారన్నారు ప్రజలకు అనారోగ్యలు ఏర్పాడుతే డోలి కట్టుకొని పది కిలోమీటర్లు డోలిమోతతో కాళినడకన వెళ్ళవలసి వస్తుందని ఆన్నారు నిత్యవసర వస్తువులు తీసుకురావడానికి దేవరపల్లి 25 కిలోమీటర్లు కోణం 10 కిలోమీటర్లు సంతలకు వెళ్లి భుజాలపై తలపై నిత్యవసర వస్తువులు మోసుకొని రావాల్సి వస్తుందని తెలిపారు ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించి రెల్లలపాలెం గిరిజన గ్రామానికి రోడ్డు సదుపాయం కల్పించాలని అయన కోరారు ఈ కార్యక్రమంలో ఇరట ఈశ్వరమ్మ కోట గంగమ్మ దాయిరి దేముడమ్మ కోట మల్లమ్మ సోమల సూర్యనారయణ గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు దొంగతనం కేసులో ఆరుగురు అరెస్ట్

రూ.8లక్షల విలువైన విద్యుత్ వైర్లు, రూ.84 వేల నగదు, కారు స్వాధీనం

విశాలాంధ్ర-పాయకరావుపేట: ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలుచోట్ల విద్యుత్ వైర్ల దొంగతనం కేసులో 6గురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. 8 లక్షలు విలువైన విద్యుత్ వైర్లు, రూ. 84 వేల నగదు, కారు స్వాధీనం చేసుకున్నట్లు నర్సీపట్నం డిఎస్పి పి. శ్రీనివాసరావు తెలిపారు. పాయకరావుపేట పోలీస్ స్టేషన్లో సిఐ అప్పలరాజుతో కలిసి కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. మండలంలోని రాజగోపాలపురం గ్రామానికి చెందిన మంగి సుధాకర్ రెడ్డి అనే వ్యక్తి కొత్తవలసలో స్క్రాప్ వ్యాపారం చేస్తూ, కొంతమంది యువకుల బృందాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ వైర్లు దొంగతనం చేయించేవాడు. రాత్రి సమయాల్లో లేఅవుట్లలో విద్యుత్ వైర్లు దొంగలించేందుకు, ట్రాన్సుఫార్మర్ వద్ద విద్యుత్ సరఫరా నిలుపు చేసి, స్తంభాలు ఎక్కి కట్టర్లతో విద్యుత్ వైర్లు కట్ చేసి, దొంగిలించిన విద్యుత్ వైర్లను కారులో ఇతర ప్రాంతాలకు తరలించే వారిని తెలిపారు. వీరిపై కసింకోట, పరవాడ, పాయకరావుపేట పోలీస్ స్టేషన్లో కేసులు నమోదైనట్లు తెలిపారు. నమోదైన కేసులకు సంబంధించి రూ. 8 లక్షల విలువైన విద్యుత్ వైర్లను రాజగోపాల పురంలో సుధాకర్ రెడ్డి ఇంటి వద్ద స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విద్యుత్ వైర్లు అమ్మిన చోట నుంచి రూ. 84 వేలు నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీరిపై గతంలో 25 కేసులు ఉన్నట్లు తెలిపారు. అరెస్ట్ చేసిన వారిపై గ్యాంగ్ ఫైల్స్ ఓపెన్ చేస్తున్నామని, పిడి యాక్ట్ నమోదు చేస్తామని డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా కేసును చేదించిన సీఐ అప్పలరాజు, ఎస్సై పురుషోత్తం, సిబ్బందిని అభినందించారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని వినతి

విశాలాంధ్ర-పరవాడ: వీఆర్ఏల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల వీఆర్వోలు సోమ వారం పరవాడ డిప్యూటీ తహాశీల్దారు సురేష్‌నాయుడికి వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా వీఆర్ఏల సంఘం జిల్లా కోశాధికారి ములకలపల్లి సంతోష్ కుమార్, మండల సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్ శంకర్‌రావు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, పేస్కేల్ అమలు చేయాలని, అర్హత ఉన్న వీఆర్ఏలకు విఆర్వో ప్రమోషన్ కల్పించాలని, ఏళ్ల తరబడి నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలుగా నియమించాలని కోరారు. అటెండర్, వాచ్‌మేన్‌ల ప్రమోషన్‌లు 20 శాతం నుంచి 70 శాతానికి పెంచాలని కోరారు. వీఆర్ఏలకు అక్రమ నైటు డ్యూటీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాగా వీఆర్ఏల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 30న అనకాపల్లి కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల గౌరవాధ్యక్షుడు వై బాబురావు, సిఐటియు నాయకులు వివి రమణ, బి.రాజు, పెంటారావు, పైడిరాజు, రూప. కుమారి. లక్ష్మి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ కార్యాలయం వద్ద వర్మీ కంపోస్ట్ విక్రయం

విశాలాంధ్ర -పాయకరావుపేట: మండలంలోని నామవరం, సీతారాంపురం గ్రామాలలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల్లో తయారైన వర్మి కంపోస్ట్ ను అనకాపల్లిలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద పంచాయితీ కార్యదర్శులు అమ్మకాలు చేపట్టారు. వర్మి కంపోస్ట్ ఉపయోగించిన పంటలను వివరిస్తూ వర్మి కంపోస్ట్ ను విక్రయాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మల్లికార్జున చారి, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ నరసింగరావును పరామర్శించిన వైసీపీ నాయకులు

విశాలాంధ్ర-అచ్యుతాపురం: ఖాజీపాలెం గ్రామ సర్పంచ్ పీలా నర్సింగరావును మండల వైసీపీ నాయకులు సోమవారం పరామర్శించారు . సర్పంచ్ నరసింగరావు ఇటీవల కాలుకి గాయాలు కావడంతో వైసిపి మండల నాయకులు ఇంటికి వెళ్లి పరామర్శించారు . పరామర్శించిన వారిలో వైసిపి మండల పార్టీ అధ్యక్షులు దేశంశెట్టి శంకరరావు , ఎంపీపీ కోన సంధ్య బుజ్జి సర్పంచ్ లు గొర్లె అశ్విని నూకరాజు , పైడిరాజు తదితరులు ఉన్నారు.

అప్పుల బాధతో రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య

రిసార్ట్ లో ఉయ్యాల కొక్కానికి ఉరివేసుకొని బలవన్మరణం

విశాలాంధ్ర -దేవరాపల్లి: విశాఖకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి నడింపల్లి సత్యనారాయణరాజు(70) దేవరాపల్లి మండలం మామిడి పల్లి లోని రిసార్ట్ ఆత్మహత్య చేసుకున్నాడు ఆర్థిక ఇబ్బందుల వల్లే తాను బలవన్మరణానికి పాల్పడుతున్నానంటూ ఆత్మహత్య చేసుకునే ముందు ఆయన రాసిన స్వయ మరణధృవపత్రాన్ని పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. మృతుడి భార్య విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్చార్జ్ యస్సై ఆర్. ధనుంజయ్ తెలిపారు. ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. విశాఖ నగరంలోని సీతమ్మధారకు చెందిన నడింపల్లి సత్యనారాయణరాజు గత 40 సంవత్సరాల నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. వ్యాపారం లో కొంత మంది నుంచి తనకు రావలసిన బకాయిలు రూ. కోట్లకు పేరుకుపోవడంతో ఆయన వ్యాపారంలో బాగా నష్టపోయారు. దేవరాపల్లి మండలం మామిడిపల్లిలోని రిసార్ట్ కి అప్పుడప్పుడు వచ్చి, ఇక్కడ ఒక్క రోజు ఉండి మరలా వెళ్లిపోయే వారు. ఆదివారం ఉదయం 10:30 గంటల ప్రాంతంలో రిసార్ట్ కి వచ్చిన ఆయన మధ్యాహ్నం, రాత్రి భోజనం చేశారు. సోమవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో రిసార్ట్ మేనేజరు రాయి శివ నిద్ర లేచి చూసే సరికి గది బయట ఉన్న ఉయ్యాల కొక్కానికి తాడు కట్టి సత్యనారాయణ రాజు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించారు. ఈ విషయాన్ని రిసార్ట్ యజమాని ద్వారా దేవరాపల్లి పోలీసులతో పాటు మృతుడి బంధువులకు సమాచారం అందించాడు. అతని సమాచారంతో ఘటన స్థలానికి హెచ్ సి ప్రకాశరావు చేరుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారి సత్యనారాయణ బలవన్మరణానికి పాల్పడిన గదిని పరిశీలించారు. ఆయన చనిపోయే ముందు తన మనోవేదనతో పాటు తనకు రావలసిన బకాయిలు, తాను ఇవ్వవలసిన బకాయిల గురించి 6 గురు వ్యక్తులకు విడివిడిగా రాసిన ఉత్తరాలు పోలీసులు కనుగొని, వాటిని స్వాధీనం చేసుకున్నారు. తాను పిరికితనంతో ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ ఆ ఉత్తరాల్లో స్వయంగా రాశారు. తమ రిసార్ట్ కి వచ్చినపుడల్లా తీవ్రంగా మదన పడుతూ ఏద్చే వారని రిసార్టులో పనిచేస్తున్న సిబ్బంది పోలీసులకు తెలిపారు. మృతుడికి భార్య విజయలక్ష్మి, కుమారుడు సాయి చైతన్య వర్మ ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్చార్జ్ యస్సై ధనుంజయ్ తెలిపారు.

పదవ తరగతి ప్రతిభావంతులకు చిరు సత్కారం

యువతకి నూతన ప్రేరణ ...

విశాలాంధ్ర-చోడవరం: మండలంలో విద్యా రంగానికి ఓ మరపురాని రోజుగా,... పదవ తరగతి వరీక్షల్లో అత్యధిక మార్కులతో ప్రథమ స్థానాలు సాధించిన ప్రతిభావంతులను లయన్స్ క్లబ్ చోడవరం శాఖ ఆధ్వర్యంలో లక్ష్మీపురం జెడ్.పి.ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం ఘనంగా సత్కరించారు. చోడవరం లయిన్స్ క్లబ్ అధ్యక్షుడు, డా.నీలం నాగేంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వదిలో విజయం సాధించిన విద్యార్థుల కృషికి, భవిష్యత్తు ఆశయాలకు వేదిక కావాలన్నారు. లయన్స్ క్లబ్ చోడవరం శాఖ అధ్యక్షులు లయన్ డాక్టర్ నీలం నాగేంద్రబాబు గారు, ఉపాధ్యక్షులు లయన్ పసుమర్తి సాంబశివరావు గారు తదితర లయన్స్ క్లబ్ ప్రముఖులు, కార్యవర్గ సభ్యులు విద్యార్థుల విజయం అనేక మందికి ప్రేరణగా మారాలని, ప్రతీ విద్యార్థి తమ లక్ష్యాలను అధిగమించేందుకు దీక్షతో ముందుకు సాగాలని వారు ఆకాంక్షించారు. విజేతలకు లయన్స్ క్లబ్ తరపున సుమారు లక్ష రూపాయల నగదు ప్రోత్సాహం అందించడమే కాక, సత్కార సాలువాలు, జ్ఞాపికలు బహూకరించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల ప్రతిభను మరింత వెలుగులోనికి తీసుకువచ్చారు. ఈ కార్య క్రమంలో లయిన్స్ క్లబ్ ఉపాధ్య క్షుడు పసుమర్తి సాంబ శివరావు, కార్యదర్శి వరుఖల రమణమూర్తి (వాణి బాబు), లక్ష్మీపురం గ్రామ ఉపసర్పంచ్ ఆది గణపతి నాయుడు, మండల విద్యాశాఖ అధికారి సింహాచలం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ.వి జగన్నాథ రావు, స్కూల్ కమిటీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.లయన్స్ క్లబ్ సభ్యులు ముక్కా రమేష్ (సర్వీసెస్ చైర్పర్సన్), డాక్టర్ పూసర్ల శకుంతల రావు (ఎల్సిఐఎఫ్ చైర్పర్సన్), సాయిరాం శ్రీను (సాయిరాం గ్రాండ్), నల్లమిల్లి గనీరెడ్డి (మార్కెటింగ్ చైర్పర్సన్), బద్రి మహంతి పల్లున్ (ఆర్గనైజింగ్ సెక్రటరీ), ఉగ్గిన నాగబాబు, వేపాద సత్యనారాయణ, పనతల గంగాధర్ మాస్టారు, విజయ బుజ్జి రెడ్డి (ట్రెజరర్), ఎన్ ఎస్ షాపింగ్ మాల్ శ్రీనివాసు, రుద్రరాజు సతీష్ వర్మ, శ్రీనివాసరావు మాస్టారు, సుంకర సత్యనారాయణ తదితరులు తమ మద్దతు అందించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ, "పట్టణంలోని వివిధ రంగాలలో సేవలో ఉన్న ప్రతీ ఒక్కరు లయన్స్ క్లబ్ కుటుంబంలో చేరి, మరిన్ని సేవా కార్యక్రమాలతో సమాజాన్ని మేలుపరచడంలో భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు. చోడవరం అభివృద్ధి లక్ష్యంగా, విద్యార్థులకు అండగా నిలవడానికి లయన్స్ క్లబ్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం కేవలం విజయోత్సవం మాత్రమే కాదు, భవిష్యత్ లక్ష్యాలను చేధించాలనే సంకల్పానికి మూలస్థంభంగా నిలిచిందని తెలిపారు. చోడవరం మండలం లో గల 14 ప్రభుత్వ/జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఇటీవల ప్రకటించిన పదో తరగతి పరీక్ష ఫలితాలు లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించిన 16 మంది విద్యార్థి, విద్యార్థులను ఈ రోజు మండల విద్యాశాఖాదికారి కార్యాలయం లో మండల విద్యాశాఖాది కారులు బి. పడాలదాస్, కె. సింహాచలం లు అభినందన సభ ఏర్పాటు చేసి విధ్యార్థులను వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారులు మాట్లాడుతూ ఈ సంవత్సరం సాధించిన ఫలితాలు పై సంతృప్తి వ్యక్తం చేస్తూ విద్యార్థులు పట్టుదలతో ఇష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించారని,పిల్లల విజయాలలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, రవిశంకర్,శిరీషా, నాగలక్ష్మి,కె.వి.యమ్.నాయుడు,సరోజిని, భూలక్ష్మి, చంద్రిక, సత్యనారాయణ మరియు రమేష్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

విశాలాంధ్ర-యస్.రాయవరం : ఎస్. రాయవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 84 -85 సంవత్సరం కు చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు అపూర్వ కలయిక జరిగింది. మండలంలో ముఖ్య వ్యాపార కేంద్రమైన అడ్డరోడ్డు వద్ద ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తెలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు .చదువుకున్న సమయంలో చేసిన పనులు అప్పట్లో పాఠ్యాంశాలు ఉపాధ్యాయులు గురించి చర్చించుకున్నారు. ఒకరికి ఒకరు తమ ఆర్థిక ఉద్యోగ వివిధ అభివృద్ధి విషయాలను పంచుకున్నారు .అనంతరము అందరూ కలిసి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో నడిగట్ల రాజు, బి. దేవిడ్ కిరణ్ కుమార్ ,వీసం భాస్కరరావు, కే .నరసింహమూర్తి, టీవీ బాబ్జి, కే .సోమేశ్వరరావు, డి. నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కార్మికుల బకాయిలు తక్షణమే చెల్లించాలి

- సిఐటియు మండల కార్యదర్శి ఎస్.బ్రహ్మాజీ

విశాలాంధ్ర-మునగపాక : మండలంలోని ఉపాధి హామీ కార్మికుల బకాయిలను తక్షణమే చెల్లించి వారిని ఆదుకోవాలని సిఐటియు మండల కార్యదర్శి ఎస్.బ్రహ్మాజీ డిమాండ్ చేశారు.ఈ మేరకు స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ఉపాధి కూలీలతో కలిసి ఆయన ధర్నా కార్యక్రమం చేపట్టారు.ఉపాధి కూలీల పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని,ఉపాధి కూలీల ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేశారు. అనంతరం ఎంపీడీవో ఉషారాణికి సమస్యలతో కూడినవినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా బ్రహ్మాజీ మాట్లాడుతూ మండలంలో ఉపాధి కూలీలకు ఆరు రోజులకు ఒకసారి ప్లేసులు ఇవ్వలేదు సరి కదా పని ప్రదేశంలో భద్రత కరువైంది అన్నారు. కొలతలు లేకుండా రూ.307లు చెల్లించాలని ప్రభుత్వం చెబుతున్న అది ఎక్కడ అమలు కాని పరిస్థితి ఉందన్నారు. పని ప్రదేశంలో విష కీటకాలు మరియు వారి వినియోగించే పారా, పలుగు వంటి పరికరాల వలన ప్రమాదాలు జరుగుతున్న ప్రమాద బీమా కల్పనలో ప్రభుత్వం విఫలమైందన్నారు. పని ప్రదేశంలో వారు వినియోగించే పారా, పలుగు, గంపలకు అద్దె చెల్లించని దాఖలాలు లేవన్నారు. ఎండలు మండుతున్న వేళ నీడను కల్పించలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని ఉపాధి కూలీల బకాయిలను చెల్లించడంతోపాటుగా పని ప్రదేశంలో సౌకర్యాలను మెరుగుపరచాలని, ప్రమాద భీమా5 లక్షలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కార్మికులు వేగి శివ, దాడి భాస్కరరావు, గోవిందా, సూరిబాబు, గాలి అప్పారావు, టెక్కలి చిన్న సూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కొండలను మింగుతున్న అధికార పార్టీ అనకొండలు

- కేజీఎఫ్ మూవీ తరహాలో కొండలను పిండి చేస్తున్న కూటమి పెద్దలు

విశాలాంధ్ర-చోడవరం : చోడవరం మండలంలో అధికార కూటమినేతల అండదండలతో కొందరు అనకొండలు కొండలను మింగుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మైనింగ్ మాఫియా కు అమ్ముడుపోయిన ప్రభుత్వ అధికారులు చూసి చూడనట్లు నటిస్తుండడంతో కే జి ఎఫ్ సినిమా తరహాలో కొండలను పిండి చేసి గ్రావెల్ తరలించి సొమ్ము చేసుకుంటున్నారని మహిళలు ప్రజా సంఘాలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని నరసాపురం, గవరవరం, ఖండేపల్లి, భోగాపురం తదితర గ్రామాల్లో కొందరు భూ బకాసురులు అధికార పార్టీ అండదండలతో ప్రభుత్వ అధికారులను డబ్బుతో కొనేసి కొండలను తవ్వి అక్రమంగా గ్రావెల్ తరలించి సొమ్ము చేసుకుంటూ బడా వ్యాపారాలు సాగిస్తున్నారు. నరసాపురం కస్తూరిబా పాఠశాల సమీపంలో అక్రమ గ్రావెల్ తవ్వకాలతో భారీ గుంతల వల్ల మేతకు వెళ్తున్న పశువులకు, మనుషులకి ప్రమాదం జరిగే అవకాశం ఉందని, ప్రభుత్వ అధికారులకు పలుమార్లు తెలియపరిచినను నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. మండలంలోని కొండ ప్రాంతాలను ఓ ప్రముఖ న్యాయవాది 100 సంవత్సరాలకు ప్రభుత్వం దగ్గర లీజు తీసుకున్నట్టు స్థానికులు చెబుతున్నారు. రోడ్డు పక్కన ఉన్న స్థలాలు, షాపులు ఆ న్యాయవాదివని ఆయా షాపు ఓనర్లు చెపుతున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యే అండదండలతో 4 జెసిబిలు,12 టిప్పర్ లారీలతో రాత్రి 10 గంటల నిండి గ్రావెల్ ను లేఅవుట్లకి తరలించి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఇంతటి భారీ స్థాయిలో గ్రావెల్ తరలిస్తున్నను, ఈ విషయం అధికారులకు తెలిసినను, అక్రమార్కుల సుములకు అమ్ముడుపోయిన ప్రభుత్వ అధికారులు నిమ్మక నేరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. కొండల మీద ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న గ్రామస్తులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కొండలను గుల్ల చేస్తున్నను, అధికారులు ఎందుకు స్పందించలేదని ప్రజలు మండి పడుతున్నారు. అధికారులు ముడుపులు అందుకున్నారనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. అక్రమ వ్యాపారాలకు స్థానిక అధికార పార్టీ ఎమ్మెల్యే కొమ్ము కాస్తున్నారని ఆరోపణలు అయితే లేకపోలేదు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, లంచాలకు కక్కుర్తి పడుతున్న స్థానిక అధికారులు, అక్రమ గ్రావెల్ ఇసుక వ్యాపారులపై చర్యలు తీసుకొని కేసు నమోదు చేస్తారని పలు ప్రజా సంఘాలు మహిళలు స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

గ్రంధాలయంలో ప్రారంభమైన వేసవి శిక్షణ కార్యక్రమాలు

విశాలాంధ్ర-నర్సీపట్నం : నర్సీపట్నం శాఖా గ్రంథాలయం వేసవి శిక్షణ కార్యక్రమాలు అట్ట హాసంగా ప్రారంభమయ్యాయి. నర్సీపట్నం మండల విద్యాశాఖధికారి సీ.హెచ్.తలుపులు రిబ్బన్ కటింగ్ తో ప్రారంభించారు. పిల్లలతో కొంతసేపు ముచ్చటించారు. ఒకరు మరో ఇద్దరిని తీసుకురావాలని, సమ్మర్ క్యాంపు వినియోగించుకోవాలని కోరారు.బుక్స్ చదివి కొత్త విషయాలు తెలుసుకోవాలని వేసవిలో అట పాటలతో పాటు గ్రంథాలయ పఠనము ముఖ్యమని అవగాహన పరిచారు. ఉపాధ్యాయులు జి.శ్రీనివాస్, జి సుబ్బారావు పిల్లలను ఉద్దేశించి సమ్మర్ క్యాంపు ఉపయోగాలు, వివరించారు. గ్రంధాలయదికారిణి పి. దమయంతి సమ్మర్ క్యాంపు ఎన్నిరోజులు ఉంటుందో అన్ని విషయాలు వివరించారు. మే 1 నుండి డ్రాయింగ్, క్రాఫ్ట్ టీచర్స్ని సమ్మర్ క్యాంపు కి పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి. ప్రభాకర్ కూడా పాల్గొన్నారు.

పాయకరావుపేట : పాయకరావుపేట శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి కే.ఎన్.గాంధీ పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు అందించారు. 40 రోజులు పాటు జరిగే విజ్ఞాన తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.సీతారామయ్య, యోగా గురువు ప్రసాద్, వై.అచ్యుత రావు, తేజోమూర్తుల వెంకటేశ్వర్లు, గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మునగపాక : మునగపాక శాఖ గ్రంథాలయంలో సోమవారం నుండి వేసవి

విజ్ఞాన శిబిరం ప్రారంభించడం జరిగిందని గ్రంథాలయ శాఖ అధికారి ఎల్.వి రమణ తెలిపారు.విద్యార్థులకు కథలు చదివించడం చెప్పడం,జీకే,దేశ నాయకుల జీవిత చరిత్ర పుస్తకాలు చదివించడం జరుగుతుందని, సుమారు 15 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు.ఇంకా అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొవాలని గ్రంథాలయ అధికారి కోరారు.

చదువులో పోటీతత్వం ఉండాలి: సిఐ రామకృష్ణ

విశాలాంధ్ర -యస్ .రాయవరం : చదువుకునే విద్యార్థులకు పోటీ తత్వం ఉండాలని నక్కపల్లి రూరల్ సీఐ రామకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని పెదగుమ్ములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొద్దిరోజులుగా పి ఆర్ టి యు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్ ను సిఐ రామకృష్ణ సందర్శించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ...పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఇప్పటినుంచే పోటీ పరీక్షలు రాయడం వల్ల తమ అనుకున్న లక్ష్యాన్ని సాధించగలరని అన్నారు .ప్రభుత్వ ఉపాధ్యాయుల సహకారంతో ఇటువంటి కోచింగ్ సెంటర్ పెట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు మండల అధ్యక్షుడు భద్రరావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, సమన్వయకర్త సత్యనారాయణ, ఉపాధ్యాయులు శేఖర్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో అర్జీలను పరిష్కరించాలి

- పి.జి.ఆర్.ఎస్‌కు డివిజన్/ మండల స్థాయి అధికారులు తప్పక హాజరవ్వాలి
- పి.జి ఆర్.ఎస్.లో వచ్చిన అర్జీలు 257
- జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్

విశాలాంధ్ర-నర్సీపట్నం : నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించె ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమానికి డివిజన్, మండల స్థాయి అధికారులు తప్పక హాజరు హాజరుకావాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ ఆదేశించారు. సోమవారం నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన పి.జి.అర్.ఎస్. కార్యక్రమంలో జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్, జాయింటు కలెక్టరు ఎమ్. జాహ్నవి, నర్సీపట్నం రెవిన్యూ డివిజనల్ వి.వి. రమణ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజల నుండి తీసుకున్న అర్జీల గూర్చి వెంటనే సంబంధిత అదికారులను వివరాలు అడిగి తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం డివిజన్ / మండల స్థాయి అధికారులతో పెండింగు అర్జీలపై సమీక్ష నిర్వహిస్తూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని తెలిపారు. పిజిఆర్ఎస్ కార్యక్రమానికి డివిజన్ / మండల స్థాయి అధికారులు మాత్రమే హాజరుకావాలని, దిగువస్థాయి సిబ్బందిని పంపించకూడదని ఆదేశించారు. డివిజన్ /మండల స్థాయిలో చిన్న చిన్న సమస్యలకు అక్కడే పరిస్కారం చూపిస్తే అర్జీదారులు అనకాపల్లి కలెక్టర్ కార్యాలయనికి వచ్చే అవకాశం ఉండదని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రజలు అందజేసిన అర్జీల పరిష్కారానికి అర్జీదారులతో నేరుగా మాట్లాడాలన్నారు. పరిష్కారం అయ్యే సమస్యలను పరిష్కరించి ధరఖాస్తుదారునికి తెలియజేయాలని, పరిష్కారం కాని ధరఖాస్తుల గూర్చి వారికి అందుకుగల కారణాలు వివరంగా తెలియజేయడం ద్వారా అర్జీలు రీ ఓపెన్ కాకుండా నివారించవచ్చని తెలిపారు. అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలని, ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలని సూచించారు. వచ్చిన ప్రతి అర్జీని సంబంధిత శాఖ అధికారి అర్జీల స్థితిని ప్రతిరోజు పర్యవేక్షణ చేసి, నిర్దిత సమయంలో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి ఎస్.ఎన్.మూర్తి, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వీర జ్యోతి, ఎంపీడీఓ ఉషశ్రీ, తహసీల్దార్ రామారావు, మునిసిపల్ కమిషనర్ సురేంద్ర, అధికారులు, అర్జీదారులు, తదితరులు పాల్గొన్నారు.

దర్గాగా వేములపూడిలో భూ ఆక్రమణ

విశాలాంధ్ర-నర్సీపట్నం : నాయకుల అండదండలు ఉన్నాయో లేక అధికారులతో కుమ్మక్కో కానీ వేములపూడి నడిబొట్టులో సుమారు 50 లక్షల విలువచేసే ప్రభుత్వ భూమి దర్గాగా కబ్జా చేసి రేకుల షెడ్డు నిర్మాణం చేస్తున్నాడు ఒక అసామి. స్థానికుల కథనం ప్రకారం చింతల నానాజీ అనే వ్యక్తి గత కొంతకాలంగా ప్రభుత్వ భూమిపై కన్నేశాడు.వేములపూడి నడిబొడ్డున రోడ్డుకి అనుకొని ఉన్న భూమిలో షెడ్ నిర్మాణం కోసం భూమిని చదును చేసాడు ఈ షెడ్ నిర్మాణం పునాది స్థాయిలో ఉండగానే తాసిల్దార్ ఫిర్యాదు చేయగా పిలిచి హెచ్చరించినట్లు సమాచారం.అయితే కొద్ది రోజులుగా నిర్మాణం జరపకుండా ఉన్నాడు. తర్వాత నాయకులు హామీ ఇచ్చారో లేక అధికారులతో కుమ్మక్కు అయ్యాడో గాని మళ్లీ జోరుగా నిర్మాణం ప్రారంభించాడు.కొద్ది రోజుల్లోనే షెడ్ నిర్మాణం చకచగా జరిగిపోయింది. రోజు అటువైపు తిరిగే పంచాయతీ సెక్రెటరీ కానీ మిగతా అధికారులు కానీ ఎటువైపు కన్నెత్తి చూడలేదు.అటువైపు చూడకూడదు అనుకున్నారు లేక నిజంగానే చూడలేదు కానీ నానాజీ మాత్రం ప్రభుత్వ భూములు అక్రమంగా కాజెయటానికి చూసాడు. ఇంత విలువైన భూమి అక్రమనకు గురైన నాయకులు గాని అధికారులు కానీ స్పందించకపోవడం పట్ల స్థానికంగా విమర్శలు వెలుగుతున్నాయి ఎవరు స్పందించుకోవడంతో విషయాన్ని స్థానికులు మీడియా దృష్టికి తీసుకువచ్చారు ఓరకంగా వేములపూడి పంచాయతీలో ప్రభుత్వ ఆస్తులు రక్షణ కరమైన చెప్పవచ్చు.ఇదే స్థల విషయమై మళ్ళీ ఎస్సీ కాలనీ రమణ సోమవారం కలెక్టర్కి గ్రీవెన్స్ లో పిర్యాదు చేసారు.

భద్రత ప్రమాణాలు పాటించని క్వారీ, క్రషర్లపై చర్యలు : జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి : జిల్లాలోని భద్రత ప్రమాణాలు పాటించని క్వారీ, క్రషర్ల పై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తుహిన్ సిన్హా హెచ్చరించారు. సోమవారం అనకాపల్లి మండలం, మార్టూరు గ్రామ పంచాయతీ పరిధిలోని క్వారీ, స్టోన్ క్రషర్ యూనిట్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయనతో పాటు అనకాపల్లి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.అశోక్ కుమార్, ఎస్సై జి.రవికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ క్వారీ, స్టోన్ క్రషర్ యూనిట్లలో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, ప్రతి క్వారీ , క్రషర్ యూనిట్ వద్ద హెచ్చరిక బోర్డులు (సేఫ్టీ బోర్డులు) ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతీ క్వారీ, స్టోన్ క్రషర్ యూనిట్ల దగ్గర అక్కడికి వెళ్లగానే అది ఎవరిదో అందరికీ తెలిసేలా , సరిహద్దులు నిర్ణయిస్తూ బోర్డ్ లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మైన్స్ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు తో జాయింట్ గా ఇన్స్పెక్షన్ చేసి నియమ నిబంధనలు పాటించని వారి మీద, భద్రత ప్రమాణాలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, భద్రతా నిబంధనలు ఉల్లంఘించిన యూనిట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధితో పాటు ప్రజల ప్రాణ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం అనివార్యమని ఎస్పీ చెప్పారు.

ఆరు రోజుల పాటూ అవిరామంగా కొనసాగిన శ్రీరామరక్ష రథయాత్ర

నేటి నుంచి యలమంచిలిలో ప్రారంభం

విశాలాంధ్ర-రాంబిల్లి : మండలంలో సోమవారంతో శ్రీరామరక్ష రథయాత్ర ముగిసింది. మత్రిపాలెం, కుమ్మరాపల్లి, మురకాడ,రజాల, కట్టుబోలు, దిమిలి గ్రామాలలో విశాఖ డైరీ చైర్మన్ అడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో శ్రీరామరక్షా రథయాత్ర యలమంచిలి పురపాలక సంఘం చైర్ పర్సన్ పిళ్ళా రమకుమారి పర్యవేక్షణలో ఆరు రోజులపాటు భక్తుల కోలాటాలు, భక్తి పాటల నృత్యాలతో వైభవోపేతంగా సాగింది.ఈ ఆరు రోజుల పాటు కొనసాగిన శ్రీ రామరక్ష రదయాత్రకు ప్రతీ గ్రామంలో విశేషంగా స్వాగతం పలికి బ్రహ్మరథం పట్టారు. చిన్న పెద్ద తేడా లేకుండా బాల రాముని దర్శించుకున్నారు. వేద పండితులు శ్రీమన్నారాయణకి హారతి ఇచ్చే విధానంతో ప్రజలందరూ శ్రీరామభక్తి పారవశ్యంతో మునిగిపోయారు.అనంతరం మంగళవారం నుండి యలమంచిలి మండలంలో ప్రారంభం అవ్వనున్నట్లు ప్రతినిధుల తెలిపారు. ఈ రదయాత్రలో వసంతవాడ దిన్ బాబు,వర్మ, రవి వర్మ ,శివాజీ రాజా బహదూర్, కొల్లి అప్పారావు, జయరాం,పప్పు ఈశ్వరరావు, పదాల గుర్నాథరావు, మూర్తి శ్రీను.సర్పంచులు, ఎంపీటీసీలు, పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

మహిళాలు కుట్టు మిషన్ శిక్షణలో నైపుణ్యాన్ని పొందాలి

ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

విశాలాంధ్ర-కశింకోట : ఉచిత కుట్టు మిషన్ శిక్షణను మహిళలు పక్కగా నేర్చుకోవాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు.సోమవారం మండలంలోని సోమవరం గ్రామంలో రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ మన గ్రామంలో మనకు అత్యంత దగ్గరగా కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించుకోవడం చాలా సంతోషమని, శిక్షణలో పాల్గొంటున్న ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెలకువలతో కూడిన శిక్షణ అందించాలని, అది వారి జీవనోపాధికి పూర్తిగా ఉప యోగపడేలా ఉండాలన్నారు. మహిళ కుటుంబ స్థితిగతులు ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఎంబ్రాయిడింగ్ శిక్ష ఇచ్చే విధంగా కృషి చేస్తామని చెప్పారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేరిపించాలన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ద్వారపు రెడ్డి పరమేశ్వరరావు, ఉగ్గిన రమణ మూర్తి, వేగి గోపికృష్ణ, సిదిరెడ్డి శ్రీనివాసరావు, ఉల్లింగల రమేష్, వెంకట లక్ష్మీ, కలగ సోమేశ్వరరావు, గొంతిన నాయుడు, నైనం శెట్టి రమణరావు, అప్పికొండ అప్పారావు, మందపల్లి శివ, పంచాయతీ కార్యదర్శి సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

కమిషనర్ పల్లి నల్లనయ్య

విశాలాంధ్ర-విజయనగరం : నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుండి ఒక వినతి వచ్చింది. విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ప్రజా వినతిని స్వీకరించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే వెనతులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఆస్తి, ఖాళీ స్థలముల పన్నుల చెల్లింపులో ప్రభుత్వం కల్పించిన వడ్డీ మాఫీ, రిబేటు సౌకర్యాలను పొంది పన్నులు చెల్లించేందుకు మరో రెండు రోజుల మాత్రమే గడువు ఉన్నదని అన్నారు. కావున వెంటనే ఆస్తి, ఖాళీ స్థలముల పన్నులను చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈఈ టి.రాయల్ బాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, టౌన్ సర్వేయర్ సింహాచలం పాల్గొన్నారు.

తండ్రి జ్ఞాపకార్థం మొక్కలు పంపిణీ చేసిన కుమార్తె, కుమారుడు

విశాలాంధ్ర-జామి : ప్రతీ కుటుంబంలో ఎవరైనా పెద్దలు మరణిస్తే వారి జ్ఞాపకార్థం ఏదో ఒక వస్తువులేదా దుస్తులు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. కానీ తండ్రి అమితంగా ప్రేమించే మొక్కలను తండ్రి కర్మకాండలకు వచ్చిన వారికి ఇవ్వాలని ఈకుటుంబం నిర్ణయించింది. జామి గ్రామానికి చెందిన రంభసన్ని తిరుమల వెంకన్న సన్నిదిలో గుండెపోటుకు గురై మరణించారు. అతని మృతదేహాన్ని టీటీడీ అంబులెన్స్‌లో జామి తీసుకువచ్చి జామిలోశ్మశానవాటికలో దహనసంస్కారాలు నిర్వహించారు. మూడవ రోజు పురస్కరించుకుని ధిన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా కుమార్తె, కుమారుడు వచ్చిన వారికి మొక్కలను పంపిణీ చేసారు. దాదాపు 300మందికి ఈవిదంగా మొక్కలను పంపిణీ చేసారు. ఈవిదంగా మృతి చెందిన రంభసన్నికి వ్యవసాయం పట్ల ఉన్న ఇష్టాన్ని గుర్తు చేసారు.

ఐసిడిఎస్ కేంద్రాలను సందర్శించిన నాగాలాండ్ బృందం

విశాలాంధ్ర-గొలుగొండ : గొలుగొండ మండలంలో నాగలాండ్ బృందం కేంద్ర ప్రభుత్వ గుర్తించిన నాలుగు అంగన్ వాడీ కేంద్రాలను పరిలీంచి నివేదక ఇవ్వనున్నారు. ఏ ఎల్.పురంలో ఒకటి, జోగంపేట, పప్పుశెట్టి పాలెంలో మూడు కేంద్రాలు తనిఖీలు చేశారు. పీవో, సూపర్ వైజర్లు,కార్యకర్తలు పాల్గొన్నారు ఏ.ఎల్.పురంలో జి రాజకుమారి. అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి అంగన్వాడి అంగన్వాడి కేంద్రంలో ఉన్న పరిశుభ్రతను. పిల్లలను చూసుకునే విధానాన్ని స్కూలు ఆవరణలో పచ్చదనాన్ని చూసి ఈ స్కూలు చాలా ఆహ్లాద కరంగా ఉందని ఉపాధ్యాయురాలు రాజకుమారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రతినిధులతో పాటు. ఆయా అమ్మాజీ కూడా పాల్గొన్నారు.

తొలగించిన త్రాగునీటి కొళాయి మరల ఎందుకు ఇవ్వలేదు

జనసేన ఇంచార్జ్ గెడ్డం బుజ్జి

విశాలాంధ్ర-యస్.రాయవరం : మండలంలో జంగులూరు వేలంపాలెం గ్రామంలోని గ్రామ జనసేన పార్టీ అధ్యక్షుడు గొర్లె సతీష్ ఇంటికి సంబంధించిన తొలగించిన కొళాయి పైప్ లైన్ కనెక్షన్ మరల ఎందుకు ఇవ్వలేదని పాయకరావుపేట నియోజవర్గ జనసేన ఇంచార్జ్ గెడ్డం బుజ్జి పంచాయతీ అధికారులను ప్రశ్నించారు. సోమవారం గ్రామంలోని సతీష్ ఇంటిని పరిశీలించి అనంతరము స్థానిక సచివాలయంకు వెళ్లి కొళాయిను తొలగించిన కారణాలు ఏమిటని మండల అధికారులకు ఫిర్యాదు చేసిన ఎందుకు పరిష్కరించలేదని అడిగారు. రెండు మూడు రోజుల్లో పరిష్క రించాలని లేనియెడల స్థానిక ఎమ్మెల్యే హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని గెడ్డం బుజ్జి తెలిపారు. ఈకార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షుడు వప్పల శివ, మండల జనసేన యూత్ అధ్యక్షుడు లింగంపల్లి జ్యోతి కుమార్, జనసేన నాయకులు తేట కాయల అరవింద్, రాజా, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్‌పై జరగబోయే అవిశ్వాస తీర్మానానికి ఏర్పాట్లను అధికారులు పరిశీలన

విశాలాంధ్ర-బొబ్బిలి : వైయస్సార్ కాంగ్రెసు పార్టీకి చెందిన మున్సిపల్ చైర్మన్ వెంకట మురళీకృష్ణరావుపై అవిశ్వాస తీర్మానం కోసం ఇటీవల కలెక్టర్‌కు కొంతమంది కౌన్సిల్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. అవిశ్వాస తీర్మానం పెట్టిన కౌన్సిల్ సభ్యులు సంతకాలను రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో రెవెన్యూ డివిజనల్ అధికారి పరిశీలన చేశారు. అవిశ్వాస తీర్మానం కార్యక్రమం ఏర్పాట్లపై సోమవారం ఎన్నికల అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి రామ్మోహనరావు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం హాల్‌ను మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మితో పరిశీలన చేశారు. ఒక ఇండిపెండెంట్ కౌన్సిల్ సభ్యులు, 20 మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిల్ సభ్యులు, పదిమంది టిడిపి కౌన్సిల్ సభ్యులు, ఎమ్మెల్యే బేబీనాయనలకు వేరు వేరుగా కూర్చిలను వేశారు. అవిశ్వాస తీర్మానంపై మంగళవారం మున్సిపల్ చైర్మన్ ఎవరు..? అన్నది తెలుస్తుంది.

ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ ఏర్పాటు

విశాలాంధ్ర-వి.మాడుగుల : మాడుగుల ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ ఏర్పాటు చేస్తున్నట్టు ఆసుపత్రి సూపరిండెంటెంట్ బి.చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం మండల పరిషత్ అధ్యక్షులు తాళ్లపురెడ్డి వెంకట రాజారాం, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు లెక్కల కాశీబాబు, మండల ఛాయారాంలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ అంబులెన్స్ మెయింటెనెన్స్ నిమిత్తం ఆసుపత్రి అభివృద్ధి నిధులు కేటాయించడం కోసం ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని చంద్రశేఖర్ తెలిపారు. అంబులెన్స్ ఏర్పాటుకు అభివృద్ధి నిధులు కేటాయింపుకు ప్రత్యేకంగా ఆమోదం ఉండాలని ఆయనన్నారు. అలాగే ఆసుపత్రి అభివఅద్ధికి సంబంధించి మరికొన్ని విషయాలు చర్చించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యడ్ల కళావతి, పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కే.మూర్తిబాబు, హెడ్ నర్స్ బి.ప్రసన్న పాల్గొన్నారు.